


హై..హై నాయకా!

ఎడ్ల పందాలను చూస్తే ఎవరికి ఉత్సాహం రాదు.. అవి చెంగు చెంగున పరుగెడుతుంటే ఎంతటి వారిలోనైనా ఉత్సాహంగా ఉరకలు వేయాల్సిందే.. ఈయనెవరో గుర్తుపట్టారా.. ఇంకెవరు మన జిల్లాకు చెందిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్.. రంగంపేట మండలం వడిశలేరులో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పందాల పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఆయన కాసేపు ఎడ్లబండి తోలి అందరినీ ఆశ్చర్యపరిచారు.. అది చూస్తున్న జనం హై హై నాయకా అంటూ కీర్తించారు.. - వివరాలు 7లో

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024 | 5



బాలలకు..షుక్రియా!

ఏమి ప్రదర్శనలు.. ఏమి వేషధారణలు.. ఆకట్టుకునే కట్టు, బొట్టులతో.. సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత వాయిద్యాలు, సైన్స్ ప్రాజెక్టులు, బుర్రకథ, చిత్రలేఖనం, మైమ్ వంటి అనే ప్రదర్శనలతో 'క్రియ' అదిరింది. విద్యార్థులు విజ్ఞానంతోపాటు వినోదాన్ని మేళవించి తమ ప్రదర్శనలతో వహ్వా అనిపించుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో రెండోరోజు 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. వేల సంఖ్యలో చిన్నారులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. - వివరాలు 7లో..










అపరశక్తి.. త్రిశూలంలో విద్యార్థిని



అర్ధనారీశ్వరుడిగా.. చిన్నారి ప్రదర్శన



కాకినాడలో జరిగిన కారు ప్రమాదం

సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన హత్యలు

సై..బర్ తెగింపు!

సైబర్ క్రైం ఏడాది 2024.. ఎలా ఖాతాలోని డబ్బుపోయిందో తెలియదు.. కానీ ఖాతా ఖాళీ అయిపోతుందంతే.. రెక్కీ చేయడం.. ఇంటిని ఎంపిక చేసుకోవడం.. రాత్రి వేళల్లో కన్నం వేయడం.. దొరికింది దోచుకుపోవడం.. ఇదంతా ఓల్డ్.. కాలం మారింది.. సాంకేతికతతో కంటికి కనిపించని కేటుగాళ్లు క్షణాల్లో జనాల ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేసేస్తున్నారు. సైబర్ నిపుణులకు అంతుచిక్కని విధంగా దోచుకుంటున్నారు. మరో వైపు హనీట్రాప్..ఇంకో వైపు డిజిటల్ అరెస్టులు.. ఇలా ఒకటేమిటి నేర స్వభావం తీరే మారిపోయింది.. తస్మాత్ జాగ్రత్త.. ఆద మరుపుగా ఉంటే అంతే.. ఇక రోడ్డు ప్రమాదాలు.. ఆత్మహత్యలు షరా మామూలే.. ప్రతి జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు 500 దాటాయి.. మూడు జిల్లాల్లో సుమారుగా 800 మంది వర కూ మృత్యు వాత పడినట్టు సమాచారం. హత్యలు అదేస్థాయిలో పెరిగాయి.. పాతకక్షలు పడగవిప్పాయి.. ఏడాదంతా చూస్తే రక్తపాతమే.. ఏదో ఒక మూల ప్రమాదమే. ఎక్కడా ప్రశాంతత లేదు..

- సాంకేతికత తెచ్చిన కొత్త చిక్కు
- ఉమ్మడి జిల్లాలో దోపిడీలు
- కంటికి కనిపించని కేటుగాళ్లు
- హనీట్రాప్.. డిజిటల్ అరెస్టులు
- పోలీసులకు చిక్కని వైనం
- పడగవిప్పిన పాతకక్షలు
- పచ్చని తూర్పున హత్యలు
- ఆత్మహత్యలకు అంతే లేదు
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- 800 మంది మృత్యువాత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సాంకేతిక ఏ స్థాయిలో పెరుగుతుందో సైబర్ నేరాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇవి సమాజ భద్రతకు పెనుసవాళ్లుగా మారాయి. పోలీస్ వ్యవస్థకు అంతబట్టని విధంగా ఈ నేరాలు మారాయి. ఆన్‌లైన్ యాప్‌లు మోసాలతో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఏవో లింక్‌లు, మెసేజ్ పంపి, వాటిని చూడానికి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయిపోతున్న ఉదం తాలు పెరిగాయి. స్టాక్ మార్కెట్ పేరిట మోసాలు జరుగుతున్నాయి. ఇటీవల డబ్బున్నవాళ్లు, అధికారులు,ఉద్యోగస్తులు, వ్యాపారులే టార్గెట్‌గా డిజిటల్ అరెస్టులు మొదలయ్యాయి. జార్ఖండ్‌లో జాంతార జిల్లా కేంద్రంగా ఇవి ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు పసిగట్టారు. ఢిల్లీ, నోయిడా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి డిజిటల్ అరెస్టులు జరుగుతున్నట్టు సమాచారం. జిల్లాలో కొద్ది నెలల కిందట మోరంపూడి సెంటర్ ప్రాంతంలో ఓ డాక్టర్‌కు ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేసి రూ.6లక్షలు లాగేశారు. ఆఫీసర్స్ క్లబ్‌లో కోచ్‌గా పనిచేస్తున్న ఒకాయనను భయపెట్టి, డిజిటల్ అరెస్ట్ చేసి రూ.96వేలు లాగేశారు. రామచంద్రపురంలో ఒకాయనకు ఫోన్ చేశారు. రాజమండ్రికి చెందిన ఓ ఏసీటీవోను కొంతకాలం కిందట హనీ ట్రాప్ చేశారు. ఒక అమ్మాయి ఫేస్ బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా ఆయన ఒకే చేశారు. తర్వాత న్యూడ్ వీడియో రాగా చూసి చాటింగ్ మొదలెట్టాడు. తర్వాత అతన్ని బెదిరించడంతో కొంత డబ్బు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. కడియంలో ఒక విద్యార్థికి ఉద్యోగం ఆశ చూపి సుమారు రూ.10 లక్షలు లాగేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఓ స్టాక్ మార్కెట్ చేసే యువకుడు రూ.33 లక్షల వరకూ నష్టపోయాడు. జిల్లాలో ఈ తరహా నేరాలు పెరిగిపోయాయి.కానీ చాలా తక్కువ మంది మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఈఏడాది 140 సైబర్ నేరాలు..11 డిజిటల్ అరెస్టులు జరిగాయి. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు ప్రమాదం నుంచి తప్పించుకోవాలంటే కేవలం అవగాహన ఒకటే మార్గం.ఈ ఏడాది 500 వరకూ ప్రమాదాలు జరగ్గా 700 మందికిపైగా క్షతగాత్రులయ్యారు.300 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో తలకు గాయం కావడం వల్ల 90 మంది వరకూ ప్రాణాలొదిలారు. ఈ ఏడాదిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లం ఘనలపై 45 వేల కేసులు నమోదు చేయగా రూ.50లక్షల వరకూ జరిమానాలు విధించారు.ఈ ఏడాది అక్టోబరు 15న జరిగిన మహిళ అత్యాచారం జిల్లాను కుదిపేసింది. కడియం మండలం బుర్రిలంకలో నర్సరీలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న రౌతు కస్తూరి అనే మహిళపై నలుగురు అత్యాచారం చేసి చంపేసి కాలువలో పడేశారు. ఉండ్రాజవరం మండలంలో అక్టోబరు 30న దీపావళి టపాసుల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఇదే మండలంలో ఫ్లెక్సీ కడుతుండగా కరెంట్ షాక్‌కి గురై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దేవరపల్లి మండలంలో జీడిపిక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్ తిరగబడడంతో నిడదవోలు మండలానికి చెందిన ఎనిమిది మంది చనిపోయారు. ఈ ఏడాది రహదారులు రక్తాన్ని తాగేశాయి.



గన్నవరం వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్య, కుమారుడిని పట్టుకుని రోదిస్తున్న భర్త

కోనసీమలోనూ రక్తపాతం..



హత్య కేసులో అరెస్టయిన పినిపే శ్రీకాంత్(ఫైల్)

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు.. హత్యలు.. దొంగతనాలు.. దోపిడీలతో పాటు సైబర్ నేరాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 2024 సంవత్సరం రికార్డులకెక్కింది. గంజాయి.. అక్రమ మద్యం రవాణా.దోపిడీలు, దొంగతనాలు అదే స్థాయిలో ఉన్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో యువకులే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు.అనేకమంది ఆత్మ హత్యలకు పాల్పడ్డారు.వివాహేతర సంబంధాలు, భూ వివాదాలతో కొందరు హత్యలకు గురైన ఘటనలు ఉన్నాయి.జిల్లాలో 2024 సంవత్సరంలో హత్యోదంతాలు సంచలనం రేకెత్తించాయి. గతేడాది జరిగిన అయినవిల్లి గ్రామానికి చెందిన జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసును ఇటీవల పోలీసులు ఛేదించి ఆ కేసులో వైసీపీ నేత తనయుడు పినిపే శ్రీకాంత్‌ను అరెస్టు చేయడం సంచలనమైంది. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో పెంచుకున్న కొడుకు రాంబాబు ఆస్తి కోసం తండ్రి రావి వీరవెంకటనరసింహారావు (75)ను హత్య చేశాడు. ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా పెరిగింది.జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనలు నిత్యం మృత్యు ఘంటికలు మోగిస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మే నెలాఖరునాటికి 65 మంది మృతిచెందగా 230 మందికి పైగా గాయపడ్డారు. ప్రధాన రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 53 కేసుల్లో 65 మంది మృతిచెందారు. 145 కేసుల్లో 230 మందికి గాయాలయ్యాయి. జాతీయ రహదారులపైనే ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏడాదిలో భారీ దొంగతనాలు, దోపిడీలు జరిగాయి. పోలీసులు కూడా కేసుల పురోగతి సాధించి రికవరీ కూడా అదేస్థాయిలో చేశారు.



కాకినాడలో కత్తులు దూశారు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో నేరాలు, ఘోరాలు పెరిగాయి.హత్యలతో అట్టుడికింది. బ్యాంకు చోరీల దగ్గర నుంచి తుపాకీ చూపించి జ్యూయలరీ షాపుల్లో బంగారం ఎత్తుకుపోవడం, ప్రతీకారేచ్ఛతో నరుక్కోవడం వరకు అనేక పెను సంచలనాలకు జిల్లా కేంద్రంగా మారింది. అక్టోబరు 31న అర్ధరాత్రి కాజులూరు మండలం శలపాకలో ముగ్గురి దారుణహత్య జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు.ఇదే తరహాలో డిసెంబరు 15న సామర్లకోట మండలం వేట్లపాలెంలో స్థలం ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నారనే ఆగ్రహంతో దళితవాడలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని ప్రత్యర్థి కుటుంబం దారుణంగా నరికి చంపేసింది. జనవరి 23న కాకినాడలో ఏసీబీకి డ్రైనేజీ విభాగం ఈఈ పట్టుబడడంతో ఉద్యోగుల్లో దడ పెంచింది. ఫిబ్రవరి 8న ప్రత్తిపాడు స్టేట్ బ్యాంకులో జరిగిన భారీ చోరీ పోలీసులనే బెంబేలెత్తించింది. యూపీకి చెందిన ఓ ముఠా అర్ధరాత్రి వేళ ఏకంగా బ్యాంకుకే కన్నం వేశారు.ఈ ఘటనలో రూ.1.50 కోట్ల విలువైన బంగారం, రూ.30 లక్షల నగదు సైతం తస్కరించారు. ఫిబ్రవరి 26న ప్రత్తిపాడు వద్ద హైవేపై వెళ్తున్న లారీకి పంక్చర్ పడడంతో డ్రైవర్, ఇద్దరు క్లీనర్లు చూస్తుండగా రాజమహేంద్ర వరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోవడంతో ముగ్గురు దుర్మరణం పాల య్యారు. మార్చి 20న చేబ్రోలులో జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి.ఏప్రిల్ 1న కత్తిపూడిలో ఓ దుకాణంలో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. జూలై 20న కాకినాడ కల్పన సెంటర్‌లో రాత్రి 9గంటలకు వేగంగా వచ్చిన ఓ కొత్తకారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని ఓ పాదచారిని ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు.ఆగస్టు 21న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఫార్మా కంపెనీ ప్రమాదంలో 18 మంది చనిపోయారు.వీరిలో ఇద్దరు కాకినాడ జిల్లాకు చెందిన వారు ఉండడం విషాదం నింపింది. డిసెంబరు చివరి వారంలో వరుసగా కాకినాడ, అన్నవరంలో రెండు వేర్వేరు జ్యూయలరీ దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి.ఇలా ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కాకినాడలోనూ కలకలం రేగింది.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ప్రతి ధాన్యపు గింజ కొంటాం
మంత్రి నాదెండ్ల మనోహర్

కోరుకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రోడ్లపైనే ధాన్యం రాశులు అంటూ ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు.రాజానగరంలో సమావేశాన్ని ముగించుకుని శనివారం రాత్రి తిరిగి వెళుతూ మార్గమధ్యలో కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామం వద్ద రోడ్లపై ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల వారం రోజులుగా ధాన్యం రోడ్లపైనే ఉంచి కాపలా కాసుకుంటున్నామని మంత్రికి రైతులు వివరించారు. దీంతో ఎప్పటి నుంచి ధాన్యం కొనుగోలు ఆపివేశారని ఉన్నతాధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఇంకా 8వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మంత్రికి వివరించారు. దీనిపై నాదెండ్ల మాట్లాడుతూ వచ్చే సోమ, మంగళవారం నాటికి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే రూ.10 వేల జరిమానా
నూతన వేడుకలకు నిబంధనలు తప్పనిసరి : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో జిల్లా పోలీస్ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. న్యూఇయర్ వేడులకు సంబంధించి మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్దేశించిన సమయం వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ చేస్తే రూ.10 వేలు ఫైన్ లేదా ఆరునెలలు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.బైక్‌లకు సైలెన్సర్ లేకుండా తిరిగినా.. ఓవర్ స్పీడు.. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారి వాహనాలు సీజ్ చేసి, డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దుచేస్తామ న్నారు.మహిళలకు ఇబ్బందులు ఒటే మహిళా రక్షక్ టీమ్‌లను సంప్రదించాలని సూచించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

3న కొవ్వూరుకు సీఎం చంద్రబాబు రాక

కొవ్వూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం నారా చంద్రబాబు నాయుడు కొవ్వూరులో జనవరి 3వ తేదీన పర్యటిస్తారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు ఆరికిరేవుల రోడ్‌లో ఉన్న స్పెక్ లేఅవుట్‌లో ముఖ్యమంత్రి సభ, హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాలను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. కొవ్వూరు స్పెక్ లేఅవుట్‌లో గృహ ప్రవేశాలకు ముఖ్యమంత్రి వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో స్పెక్ లేఅవుట్‌లో 1100 ప్లాట్లకు సంబంధించి 800 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వంలో బిల్లులు పూర్తిగా అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు పూర్తిగా బిల్లులు చెల్లించి గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ జనవరి 3వ తేదీన కొవ్వూరు స్పెక్ లేఅవుట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, తాళ్లపూడి మండల అధ్యక్షుడు నామాన పరమేశ్వరరావు, హౌసింగ్ పీడీ ఎస్. భాస్కర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్, డీఈ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలర్స్ బ్యూటీ సెలూన్ అండ్ స్పాలో వ్యభిచారం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో స్పా ముసుగులో వ్యభిచారం చేస్తున్న బ్యూటీ సెలూన్‌పై ప్రకాష్ నగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని కలర్స్ బ్యూటీ సెలూన్ అండ్ స్పాపై ఆదివారం దాడి చేశారు.అక్కడ ఇద్దరు విటులు,ఆరుగురు మహిళలు, నిర్వాహకులను గుర్తించి అరెస్టు చేసినట్టు ప్రకాశ్‌నగర్ సీఐ బాజీ లాల్ చెప్పారు. స్పా ముసుగులో వ్యభిచారం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'క్రియ' అదిరేంది!

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- రెండోరోజూ ప్రతిభకు పట్టాభిషేకం
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు


సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి




వివిధ రకాల సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు

సర్పవరంజంక్షన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండుగ అంబరాన్నంటింది. రెండురోజులపాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక నృత్యప్రదర్శనలు, మైమరిపించే కోలాట నృత్యాలు, అబ్బురపరిచే రీతిలో ఆకట్టుకునేలా చిన్నారులు గీసిన పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో రెండురోజులుగానిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు పోటీలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు. సైన్స్ ఫేర్, చిత్రలేఖనం, సాంస్కృతిక నృత్యాలు, క్విజ్ పోటీలను స్వయం వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా జానపద నృత్యం (బృందం) విచిత్ర వేషధారణ(ఫ్యాన్సీ డ్రెస్), బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు తదిర అంశాల్లో పోటీలు జరిగాయి. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 6, 7 తరగతులకు జూనియర్స్, 8,9,10 తరగతి విద్యార్థులు సీనియర్స్ విభాగంలో రెండురోజులపాటు పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 11వేలమంది విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం లో సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరాజు, డాక్టర్ కాద వెంకటరమణ, చుండ్రు జానకీరామ్ ప్రసాద్, మాచిరాజు, అల్లూరి సురేంద్ర, బత్తుల గణేష్, శివ, కృష్ణంరాజు పాల్గొన్నారు. పోటీలకు ప్రాంగణం ఇచ్చిన జేఎన్‌టీయూ వీసీ, దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.


పిట్టల దొరగా..


యముడిగా..


అమ్మవారిగా..


మైమ్ యాక్షన్‌లో...


సంప్రదాయ వేషధారణలో..


'భువనం విజయం' గురించి వివరిస్తూ..


కార్మికులు.. రైతు కూలీలుగా..


గిటార్ వాయిస్తూ..


'ఆదర్శ గ్రామం' ప్రాజెక్టుతో..


మట్టితో అందమైన ఆకృతులు

ఆటో...బైక్!



తాళ్లరేవు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు-సుంకటరేవు 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆటో ఎదుటి భాగంపై బైక్ ఎక్కింది. ఈ సంఘటనలో యువకుడికి గాయాలైనట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. తాళ్లరేవు పంచాయతీ జిల్లావారిపేటకు చెందిన దాసరి నూకరాజు బైక్‌పై తాళ్లరేవు నుంచి నీలపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో సుంకటరేవు వద్ద యానాం నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనగా బైక్ ఆటో ఎదుటిభాగంపైకి ఎక్కింది. నూకరాజుకు గాయాలవ్వగా పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికకు...

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల నియామకానికి ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు సోమవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పారదర్శకంగా నిర్వహించేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 30 నుంచి జనవరి 18 వరకు నిర్వహించే ఈ దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా బయోమెట్రిక్, 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్‌జంప్ పరీక్షల నిర్వహణ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో ట్రైల్ రన్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సివిల్ పోలీస్ కానిస్టేబుళ్ల 381 పోస్టులకు, అలాగే ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్ కానిస్టేబుళ్ల 630 పోస్టులు పురుష అభ్యర్థులు 6,333, మహిళా అభ్యర్థులు 1,449 హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్బి డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల మరణంపై విచారణ చేపట్టాలి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బీచ్ రోడ్, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు అత్యధిక సంఖ్యలో మరణిస్తున్న విషయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. తాబేళ్ల మరణానికి కారణాలు విచారించి, దీనికి కారణమవు తున్న వారిపై చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ చిరంజీవిచౌదరిని ఆదేశించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన

మానసిక రోగి మృతి

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి దస్తులకు నిప్పు అట్టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బర్న్స్ వార్డులో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన గొల్లపల్లి విశాలాక్షి (33) 10 ఏళ్ల క్రితం డిగ్రీ పాసై టెట్‌కు ప్రిపేరైంది. ఆ సమయంలో మెదడులో కణితి ఏర్పడి మానసిక ప్రవర్తనలో తేడా వచ్చింది. కుటుంబీకులు 15రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌లోను సైకియాట్రీ వార్డులో చేర్పించగా ఫిమేల్ సెల్‌లో ఉంచి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. అందరిని కొడుతుండడంతో మంగళవారం ఆమెను లోపల ఉంచి గెడపెట్టి బయట తల్లిదండ్రులు ఉన్నారు. విశాలాక్షికి ఇంజక్షన్ టైం అవ్వడంతో వారిద్దరూ నర్సు దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో విశాలాక్షి హాహాకారాలు చేస్తుండడం విని వెళ్లి చూడగా లోపల నుంచి మంటలు వస్తుండడంతో తలుపు తీసి చూడగా కూతురు కాలిపోతుండడాన్ని గమనించారు. విశాలాక్షి 70శాతం కాలిపోయిందని గుర్తించిన వైద్యులు బర్న్స్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్యం అందజేశారు. పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్ల పందేలు సంప్రదాయాల్లో భాగం

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు
- వడిశలేరులో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు


పోటీలో పాల్గొన్న ఎడ్ల బండి



సీనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే వాసు

రంగంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు, కోడి పందేలు మన సంప్రదాయాల్లో, గ్రామీణ సంస్కృతిలో భాగమని, ఇవి లేకపోతే నాణ్యమైన పశుపక్ష్యాదుల సంపద అంతరించిపోతుందని, చట్టాన్ని అతిక్రమించకుండా ఇలాంటి పందేలను ఆదరించి పోషించుకోవాలని శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామం వద్ద గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలను ఆదివారం నిర్వహించారు. పందేలను రఘురామ తిలకించి సీనియర్ విభాగంలో విజేతలైన రైతులకు బహుమతి ప్రదానం చేశారు. తండ్రి పేరిట ఈ పోటీలను ఏటా నిర్వహిస్తున్న జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ గన్ని భాస్కరరావును ప్రశంసించారు. కాగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పోటీలను ప్రారంభించారు. పోటీలను క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషమన్నారు. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ కోడి పందేలు, ఎడ్ల పందేలు లేని తెలుగు సంప్రదాయాన్ని ఊహించలేమన్నారు. జూనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గన్నిభాస్కరరావు తెలుగు సంప్రదాయాన్ని పటిష్టం చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశ్ రావు,జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

రంగంపేట/ఆలమూరు: వడిశలేరులో జరిగిన ఎడ్లబండ్ల పరుగు పోటీల్లో సీనియర్ విభాగం (1600 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్లజత మొదటి బహుమతి, అనకాపల్లి జిల్లా కేజీపురం రైతు శ్రీఆంజనేయం ఎడ్లజత రెండో బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్ల జత మూడో బహుమతి గెలిచుకున్నాయి. జూనియర్ విభాగం(1000 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల కృష్ణమాధవి ఎడ్ల జత మొదటి బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరు రైతు కోర స్మృతి చౌదరి ఎడ్ల జత రెండో బహుమతి, నెల్లూరు జిల్లా గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరీ సీఫుడ్స్ ఎడ్ల జత మూడో బహుమతి గెలుచుకున్నాయి. పోటీల న్యాయనిర్ణేతలైన సూరపనేని రామకృష్ణప్రసాద్ (కృష్ణా జిల్లా), చేకూరి రామకృష్ణ (కాకినాడ)లను సత్కరించారు.

వెల్లివిరిసిన సృజనాత్మకత

కొండగుంటూరులో ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా


గణితరోబో,అక్షరశిరోజాల దృశ్యాలు

దివాన్‌చెరువు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్షరాల తోట– పదాలపంట, చిట్టిబుర్రలో ఇమిడిన అక్షరమాల (అక్షర శిరోజాలు)- కూడికల యంత్రం... టార్చిలైట్‌తో పదాల గుర్తింపు ఇలా ఒకటేమిటి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు తమ సృజనాత్మకతకు పదునుపెట్టారు. వెల్లివిరిసిన సృజనాత్మకతకు లోకాస్ట్-నోకాస్ట్ సామగ్రితో రూపొందించిన బోధనోపకరణాలు ప్రతిఒక్కరినీ ఆకట్టుకున్నాయి. వైవిధ్యంగా రూపొందించిన అక్షరాల వాలుజాడ, చేప బొమ్మలతో తీసివేతలు, బొమ్మచూడు- అక్షరం పట్టు తదితర బోధనోపకరణాలకు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఆరో దశ శిక్షణా శిబిరం ఆదివారం వేదికైంది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 350 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను ప్రత్యేక గదిలో ఉంచి మేళా నిర్వహించారు. నాలుగు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు దాదాపు 190 వరకూ వివిధ రకాల వర్కింగ్ మోడల్స్‌ను రూపొందించారు. టీఎల్ఎం మేళా విజ్ఞాన మార్పిడి కేంద్రంగా మారిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి చతుర్విధ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు రంగంపేట మండలం సింగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శిక్షణా శిబిరం కేఆర్‌పీ సీహెచ్ గౌతమ్‌కృష్ణ రూపొందించిన గణిత రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కూడికలు, తీసివేతలు, భాగాహారం, గుణకారం ప్రక్రియను విద్యార్థులకు సులభంగా ఉపాధ్యాయులు నేర్పడానికి, విద్యార్థులు నేర్చుకోవడానికి కూడా ఉపకరిస్తుందని శిక్షణా కేంద్రం కోర్స్ కోఆర్డినేటర్ ఎం.రాంబాబు తెలిపారు. ఈ శిక్షణా తరగతులు మంగళవారం ముగుస్తాయని తెలిపారు. ఈ రోబోను అట్టముక్కలతోవారం రోజుల్లో తయారు చేసినట్టు గౌతమ్‌కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్‌వీ సోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ అనూష, కేఆర్‌పీ కె.ఈశ్వరరావు, డీఆర్పీలు ఉన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జనవరి 3, 4, 5 తేదీల్లో జరగబోయే 50వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలోని కబడ్డీ గ్రౌండులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. మండల సూర్యనారాయణ, యశ్వంత్, జిల్లా పీడీలు, పీఈటీల అసోసియేషన్ సెక్రటరీ ఎస్.నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎస్.యానాంలో హోరాహోరీగా...

ముగిసిన మహిళల బీచ్ వాలీబాల్ పోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేషనల్ మహిళల బీచ్ వాలీబాల్ పోటీల ఫైనల్స్ ఆదివారం హోరాహోరీగా జరిగాయి. తమిళనాడు, వేల్స్ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో వేల్స్ జట్టుపై తమిళనాడు జట్టు 27-25, 22-20, 15-17 సెట్ల తేడాతో విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో టాప్4లో తమిళనాడు, వేల్స్ యూనివర్సిటీ, ఆంధ్రా, పుదుచ్చేరి జట్లు నిలిచాయి.. ఆంధ్రా, పుదుచ్చేరి జట్ల తలపడగా పుదుచ్చేరి జట్టు విజయం సాధించి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలకు మహిళలకు అధిక సంఖ్యలో హాజరుకావడం విశేషం. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీలను కొత్తపేట, పి.గన్నవరం, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, కూటమి నాయకులు అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ తిలకించారు. వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం ఆధ్వర్యంలో టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి గోలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో 33మంది పీడీలు టోర్నీ విజయవంతానికి కృషి చేశారు. టోర్నీ విజయవంతానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆనందరావు ను సహచర ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, క్రీడాకారులు సన్మానించారు. ఎస్.యానాం సర్పంచ్ జోగి రాజేశ్వరిరాజా, వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే రాజు, సంయుక్త కార్యదర్శి అయితాబత్తుల అజయ్‌సింగ్, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, సత్తి చిన్నా తదితరులున్నారు.


విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు అయితాబత్తుల, గిడ్డి

అన్నవరం దేవస్థానంలో

నగదు రహిత సేవలకు మోక్షం

రెండు కౌంటర్ల ఏర్పాటు

అన్నవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నగదు రహిత సేవలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ ఫోన్, పే, గుగూల్ పే తదితర వాటి ద్వారా లావాదేవీలు జరుపుతున్నా అన్నవరం దేవస్థానంలో ఇప్పటివరకు అటువంటి సౌకర్యం కల్పించకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి, ఇతర మీడియాలలో కథనాలు వెలువడ్డాయి. ఈవో సుబ్బారావు బాధ్యతలు స్వీకరించాక భక్తుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని రిసెప్షన్ కార్యాలయం, పశ్చిమరాజగోపురం వద్ద కౌంటర్లను ఏర్పాటు చేశామని.. భక్తులు వ్రతాలు, దర్శనం టిక్కెట్లు, విరాళాలు, వసతి సౌకర్యం కోసం ఇకపై డిజిటల్ పేమెంట్ల ద్వారా చెల్లింపులు చేపట్టవచ్చని దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించనున్నట్టు అధికారులు తెలిపారు. సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరి దాతల నుంచి రూ.2 లక్షలు విరాళంగా సమకూరాయి. కాకినాడకు చెందిన ముప్పిడి సత్యవాణి రూ.లక్ష ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన కాలా కార్తికేయ దత్త రూ.1,01,116లు దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందించగా దాతలను అభినందించారు.


విరాళం అందజేస్తున్న దాత సత్యవాణి

పాపికొండలకు 12 బోట్లలో పర్యాటకులు


పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోట్లు

దేవీపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ ఒడ్డున ఆనుకుని ఉన్న పాపికొండల అందాలను తిలకించేందుకు పర్యాటకులు తెలుగు రాష్ట్రా నలుమూలల నుంచి ఆదివారం తరలివచ్చారు. పోశమ్మగండి వద్ద ఉన్న బోటు పాయింట్ నుంచి ఉదయం 12 బోట్లలో సుమారు 800 మంది పాపికొండలు తరలివెళ్లారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవిపట్నం, మంటూరు, కొండమొదలు తదితర ముంపు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. అక్కడ శివున్ని దర్శించుకుని గిరిజనులు తయారుచేసే వెదురు వస్తువులను కొనుగోలుచేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ప్రణాళిక నిత్య నూతనం అని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. సీపీఎం పార్టీ తూర్పుగోదావరి జిల్లా మహాసభల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన ప్రతినిధులు సభలో అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి వంటిదన్నారు. దేశం, రాష్ట్రంలో కుల, వర్గ, మతం వంటి సామాజిక విభజన ఉన్నప్పటికీ కమ్యూనిస్టులను అందరూ స్వాగతిస్తారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ కవులు, కళాకారులకు పుట్టినిల్లయిన రాజమహేంద్రి అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అన్నారు. సభలో నివేదికను జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, పి.తులసి, సుందరబాబు, బేబీరాణి, ఎస్.రాజా, ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టీఎస్.ప్రకాష్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వేట్లపాలెంలో అధికారుల పర్యటన

సామర్లకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం దళితవాడలలో ఆదివారం కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు తదితర రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా పర్యటించారు. ఈనెల 15న ఒకే సామాజిక వర్గానికి చెందిన 2 కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా కత్తులతో ఒక కుటుంబం దాడులు చేసి ముగ్గురిని హతమార్చిన విషయం విదితమే. దీంతో గ్రామంలో ఆదివారం పోలీసు అధికారులతో కలిసి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించి బాధిత కుటుంబాలకు మానసిక ధైర్యం అందించారు. ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ శ్రీహరిరాజు ఇరు కుటుంబాలకు చెందిన వ్యక్తులతో చర్చించి గ్రామంలో శాంతికి సహకరించాలని కోరారు. ఇంకా ఈ సంఘటనలో పాల్గొన్న పలువురిని ఇంకా అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పగా త్వరలో నే అరెస్ట్ చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రావులపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడులో తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తాళాలు పగలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు శనగన ధర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఏడాది కాలం నుంచి స్థానిక శివాలయం వీధిలో అద్దె ఇంట్లో ధర్మయ్య నివసిస్తున్నాడు. ఈనెల 25వ తేదీన గోకవరంలో బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలు కొట్టి ఉన్నాయి. లోపలకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులకొట్టి అందులోని 20 తులాల వెండి వస్తువులు, 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంటి సిబ్బందితో వెళ్లి వివరాలు నమోదు చేసుకుని కేసు నమోదు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రూ. 5లక్షల ఉపకార వేతనాల పంపిణీ



బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బ్రాహ్మణ సేవా ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు దంతుర్తి సత్యప్రసాద్ సూచించారు. బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గోదావరి గట్టున గల మల్లిగ సత్రంలో ఆదివారం సాయంత్రం జిల్లాలోని బ్రాహ్మణ విద్యార్థులు వంద మందికి రూ. 5 లక్షల రూపాయల ఉపకార వేతనాలను ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. 2011 నుంచి ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యుఎస్‌లో స్థిరపడిన తమ సోదరుడి కుమారుడు దంతుర్తి వీరభద్రరావు ప్రతి ఏటా పంపే నిధులతో బ్రాహ్మణ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు జిల్లా ప్రతినిధులు గాడేపల్లి సత్యనారాయణమూర్తి,చక్రవర్తి,రాంబాబు,రేగడమెల్లి రాందేవ్ శర్మ, సీహెచ్‌ప్రసాద్, జోశ్యుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఏర్పాటుకు వినతి

● కమిషనర్, ఎమ్మెల్యేలకు విన్నవించిన విశ్వబ్రాహ్మణ సంఘం



కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న నక్కా చిట్టిబాబు చిత్రంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి బండ్‌పై వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కాచిట్టిబాబు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కమిషనర్ కేతన్ గార్గ్‌లను కోరారు. ఈమేరకు రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పందించి విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానన్నారు. అనుమతికి కమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ముక్కామల స్వామి, పొలమూరు సతీష్ కుమార్, లక్కోజు వీరభద్రరావు, అనుపోజు వెంకటరమణ, ముసినాడు సాగర్, గుంటముక్కల రాజు, ముక్కామల మణిబాబు, అమలోజి శివప్రసాద్, గండేబత్తుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

6న మురమండలో శాంతి హోమం

పంచ సహస్ర పార్థివ లింగార్చన
భక్తులతో 5వేల శివలింగాలు తయారీ



శివలింగాలు తయారు చేస్తున్న మహిళలు

కడియం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కడియం మండలం మురమండలో సర్వకామదాంబ సోమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 6వ తేదీన శాంతిహోమం, పంచ సహస్ర పార్థివ లింగార్చన, స్వామి వారి శాంతి కళ్యాణంకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర్ల రవిబాబు, దేవాదాయ శాఖ, భక్తుల సహకారంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు శివలింగం ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇందుకు గాను గ్రామానికి చెందిన మహిళలు భక్తి శ్రద్ధలు పాటిస్తూ , శివనామస్మరణ చేస్తూ, నియమ నిష్టలతో పంచ సహస్ర పార్థివ లింగార్చనకు గాను 5 వేల శివలింగాలు తయారు చేస్తున్నారు. వీటి తయారీకి " పుట్టమట్టి , ఆవు పంచకం, గోపేడ, పసుపు, ఆవునెయ్యి " కలిపి మట్టి ముద్దను తయారు చేసి శివలింగాల్ని తీర్చిదిద్దుతున్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం మట్టితో తయారు చేసిన శివలింగాలను గోదావరి లో నిమజ్జనం చేస్తారని ఆలయ అర్చకులు బాదంపూడి బుచ్చివెంకట సోమేశ్వర గురుకుల్ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తూ మురమండ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, మద్దుల వెంకట్రావు గ్రామం మీద అభిమానంతో ఆలయ అభివృద్ధికి పెద్దమొత్తం విరాళంగా ఇచ్చి ఆలయానికి రంగులు, గ్రానైట్, ఆలయ ఆవరణలో పచ్చని మొక్కలతో సుందరీకరణ చేయించారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఆదివారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మురపాక వీర్రాజు, మహంతి లక్ష్మణరావు, కాసాని శంకరరావు, బండి నరేంద్ర, జీవీ.రమణ, రేలంగి సూర్యభాస్కరరావు, జి.అప్పారావు, 60మంది సభ్యులు పాల్గొన్నారు.

నేనూ గురుకులం విద్యార్థినే..

» జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్
» భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం



భూపతిపాలెం మహా సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎస్పీ కిషోర్

గోకవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తాను కూడా గురుకుల పాఠశాల్లోనే విద్యనభ్యసించానని ఎస్పీ నరసింహ కిషోర్ అన్నారు. గోకవరం మండలం భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల(1984 నుంచి విద్య నభ్యసించిన విద్యార్థులు) మహా సమ్మేళనం ఆదివారం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విచ్చేశారు. ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ విశేష ప్రతిభ కనబర్చడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పాత జ్ఞాపకాలను విద్యార్థులతో నెమరు వేసుకున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఉన్నత విద్యావంతుడై అన్నిరంగాల్లో రాణిస్తేనే ఆర్థిక ఒడుదుడుకులు లేకుండా జీవించగలమన్నారు. గురుకుల పాఠశాల సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎడ్యుకేషనల్ హబ్, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయనున్నామన్నారు. రానున్న కాలంలో గురుకుల పాఠశాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని నెహ్రూ అన్నారు. అనంతరం ప్రస్తుతం పాఠశాల్లో విద్యనభ్యసి స్తున్న సుమారు 480 విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సమకూర్చిన పరుపులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ గల్లా రాముతో పాటు, సుమారు 2వేల మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

40 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు..

బిక్కవోలు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకుదురు యూపీ పాఠశాలలో 1984లో ఆరో తరగతి చదువుకున్న విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం మారేడుమిల్లిలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నప్పుడు చేసిన అల్లరి చేష్టలను గుర్తుకు తెచ్చుకున్నారు. వీరిలో చిన్నం వెంకటరెడ్డి జ్యోతి దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆ దంపతులను సత్కరించి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కొమరిపాలెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ పీవీ, చింతా శ్రీనివాసరెడ్డి, ఎస్వీ సూర్యనారాయణరెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'షాడే' పూర్వవిద్యార్థుల సమ్మేళనం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో షాడే ఇంగ్లీషు మీడియం హైస్కూల్ 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానికంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బేతంపూడి జాన్ నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పొన్నల దినకర్, చెగుండి సుజిత్, బత్తుల చాముండేశ్వరి, యర్రగుంట శివప్రసాద్, కృష్ణంరాజు తదితరులు హాజరయ్యారు. 24 ఏళ్ల క్రితం వారు చేసిన అల్లరి చేష్టలను, పొందిన మధుర అనుభూతులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.



బిక్కవోలు: కొంకుదురు యూపీ స్కూల్ ఆరో తరగతి పూర్వ విద్యార్థులు



షాడే హైస్కూల్ 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కూటమి.. అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా

● విజయంలో కీలక పాత్ర పోషించిన 700మందికి సత్కారం
●టీడీపీ తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలుస్తుందన్న గోరంట్ల



నాయకులు, కార్యకర్తలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల

రాజమహేంద్రవరంరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ మంటేనే అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో కూటమి విజయానికి కీలక పాత్ర పోషించిన 700మంది నాయకులను ఆయన ఘనంగా సత్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని జేఎన్ రోడ్డులో చెరుకూరి కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ ఆత్మీయఅభినందన సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల, టీడీపీ హెల్త్‌విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండలాధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు గంగిన హనుమంతరావులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళుల ర్పించారు. అనంతరం గోరంట్ల మాట్లాడుతూ టీడీపీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వుంటుందన్నారు. తన విజయానికి కృషి చేసిన కూటమి నాయకులకు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 700 మందిని సత్కరించి మొక్కలను బహూకరించారు. అనంతరం వారంతా కలిసి గోరంట్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, మజ్జి పద్మావతి, నున్న కృష్ణ, కురుకూరి కిషోర్, అన్నందేవుల చంటి, పండూరి అప్పారావు పాల్గొన్నారు.

పద్మశాలీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండరును రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆయన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఉద్యోగులంతా ఐక్యతతో మెలిగి ఉద్యోగ నిర్వహణలో బాధ్యతగా ఉంటూ ప్రజల సేవా కార్యక్రమాలకు సహకారం అందించాలన్నారు. తమ వంతు సహాయ కార్యక్రమాలు అందిస్తూ నిర్వహించాలని ఆకాంక్షిస్తూ పద్మశాలీల ఐక్యతను కొనియాడారు. ఈకార్యక్రమంలో యర్రమోతు ధర్మరాజు, తంగేళ్ళ హరికిషోర్, నీలం వీరవెంకట సత్యన్నారాయణ, నిచ్చనగుంట గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతులచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం



రాజమహేంద్రవరం కల్చరల్/సిటీ, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): వై జంక్షన్ వద్ద ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీలకతీతంగా నూజివీడులో జరిగిన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బీసీ నేతలైన మంత్రి పార్థసారథి,కొనకళ్ళ నారాయణ,ఎమ్మెల్యే శిరీషలను అవమానించడం, రాష్ట్రంలోని బీసీలను అవమానించడమేనన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు పాలభిషేకం చేసినట్టు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ రూరల్ అధ్యక్షుడు బిల్డర్ చిన్నా, జిల్లా నాయకులు లోడ అప్పారావు, రుక్మాంగదరావు,ఎస్.శ్రీను,కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు జలాభిషేకం



గోదావరి మాతకు జలాభిషేకం చేస్తున్న ఈశ్వరి, విజయలక్ష్మి, రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలతో గోదావరి మాతకు ఆదివారం జలాభిషేకం చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద గోదావరి మాతకు అంగన్‌వాడీ కమిటీ నగర అధ్యక్షురాలు బోను ఈశ్వరి, తెలుగు మహిళా పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహిళలు గోదావరి జలాలను తీసుకువచ్చి గోదావరి మాతకు అభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఈశ్వరి గోదావరి మాతకు మొక్కుకున్నారని చెప్పారు. తమ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలవాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆరోజు మొక్కన్నారని దాన్ని ఈ రోజు తీర్చుకున్నారని చెప్పారు. ఈశ్వరి, విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 108 బిందెలతో గోదావరి మాతకు అభిషేకం చేశామన్నారు. ఎన్నికల్లో వాసు గెలిచాక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1008 బిందెల గోదావరి జలాలతో మాతకు అభిషేకం చేస్తామని మొక్కిదాన్ని ఇప్పుడు తీర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమం లో తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, తురకల నిర్మల, గొర్రెల సత్యరమణి, ఎం.నాగమణి, టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి డి.ప్రసాద్, బి.రాధా, ఆర్.విజయ్, తెలుగు మహిళలు ఎ.లక్ష్మి, కె.లక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా నందివాడ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో 8వ బీజేపీ మండల అధ్యక్షుడిగా నందివాడ సత్యనారాయణ ఎన్నికయ్యారు. మండల పరిధిలోని బీజేపీ బూత్ అధ్యక్షుడు, క్రియాశీలక సభ్యుల ఏకాభిప్రాయంతో ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మండల రిటర్నింగ్ అధికారి బేతిరెడ్డి ఆదిత్య, మండల పూర్వ అధ్యక్షుడు కాకరాల పవన్‌కుమార్, మీడియా సెల్ కన్వీనర్ వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బిక్కవోలు అధ్యక్షుడిగా దుర్గారెడ్డి



బిక్కవోలు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలు ఆదివారం పందలపాకలోని పడాల సూర్యనారాయణరెడ్డి వాటర్ ప్లాంట్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏపీఆర్ చౌదరి ఆధ్వర్యంలో గుడిమెట్ల దుర్గారెడ్డిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. దుర్గారెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు, పవన్, పడాల రామారెడ్డి తదితరులు అభినందించారు.

రాజమహేంద్రవరం రూరల్‌కు శివకుమార్

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు7(ఆంధ్రజ్యోతి): బీజేపీ రూరల్ మండలాధ్యక్షుడిగా కొంతమూరుకు చెందిన నాగుల శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు తెలిపారు. మండలంలోని బీజేపీ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యుల ఏకాభిప్రాయంతో ఈయనను ఎన్నుకున్నట్టు మండల రిటర్నింగ్ అధికారి కాలెపు సత్యసాయిరామ్ చెప్పారు. కార్యక్రమంలో పడాల హరిరామ్, బివి రామారావు, డి.సత్యనారాయణ, సుబ్బేశ్వరావు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

గోకవరం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామరాజుపేట గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రెండు కోడి పుంజులు, 13 కత్తులు, రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.



కల్పవృక్ష వాహనంలో శ్రీకృష్ణావతారంలో దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

శ్రీకృష్ణావతారంలో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు

బిక్కవోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభించి విశేష ఉత్సవం, జల క్రీడ ఉత్సవం, ధనుర్మాస వ్రతం నిర్వహించారు. రాత్రి కల్ప వృక్ష వాహనంపై శ్రీకృష్ణావతారంలో స్వామి వారిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.



రక్తదాన దానం చేస్తున్న దాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రక్తదానంతో పలువురికి ప్రాణదానం

రాజానగరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానం..ప్రాణదానంతో సమానమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. శ్రీదుర్గా బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజానగరంలోని కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ (అన్నదాన) సత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేసిన వారు మరొకరి ప్రాణాలు కాపాడిన వారుగా నిలిచిపోతారన్నారు. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఏపీ టెక్నికల్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. బొమ్మూరులోని నరసింహరాజు ఫంక్షన్ హాల్లో జనరల్ బాడీ సమావేశం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అసోసియేషన్ మాజీ అధ్య క్షుడు ఆర్.వెంకటరామయ్య అధ్యక్షతన ఆది వారం జరిగింది. పూర్వపు 13 జిల్లాల నుంచి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సాగి వెంకట సూర్యనారాయణ(తూర్పు గోదావరి), ఎస్ఎల్ సోమయాజులు(విజయవాడ), అసో సియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.నాగప్రససాద్ (నెల్లూరు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్.కృష్ణ (విజయవాడ), ఫైనాన్స్ సెక్రటరీగా ఆర్వీ భానుప్రసాద్(అనంతపురం)తో పాటు ఐదు గురిని అధ్యక్షులుగాను, ఐదుగురిని జాయింట్ సెక్రటరీలుగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్(అడ్మిన్) కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. సెంట్రల్ డిజైన్స్ కార్యాలయం ఎస్ఈ శివకుమార్‌రెడ్డి, హెడ్ వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

కార్యకర్తల మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోసం పలువురు కార్యకర్తల మొక్కులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం చెల్లించారు. ముందుగా బాపనమ్మ అమ్మవారికి కార్యకర్త తమలంపూడి సత్తిరెడ్డి మొక్కుకున్న 101 కొబ్బరికాయల మొక్కును ఎమ్మెల్యే చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్లకాలువ వంతెన వద్ద ఉన్న సరస్వతి అమ్మవారికి కార్యకర్తలు ఏడుకొండలు మొక్కుకున్న 101 కొబ్బరికాయల మొక్కును ఎమ్మెల్యే చెల్లించి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి శేషారత్నం, పడాల వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, ఎన్.వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు ప్రసాదాలను అందిస్తున్న డిప్యూటీ ఈవో రమణమ్మ

శ్రీశైలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వి.భాస్కరరావు రూ.5,00,004 విరాళం ఇచ్చారు. డిప్యూటీ ఈవో ఆర్. రమణమ్మకు ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

నూతన సంవత్సర వేడుకల పేరుతో అసౌకర్యం కలిగిస్తే చర్యలు

అనపర్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అనపర్తి ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి బహిరంగంగా మద్యం సేవించడం, రోడ్లపై కేక్ కట్ చేయడం వంటి చర్యలకు పాల్పడ వద్దని హెచ్చరించారు. బైక్‌ల సైలెన్సర్లు తొలగించి రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వీరవరంలో అగ్ని ప్రమాదం

కడియం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కడియం మండలం వీరవరంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో 2 తాటాకు పాకలు, ఒక గడ్డిమేటు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన సుంకర ధనరాజు, గుండుబోగుల రాంబాబుకు చెందిన తాటాకు పాకలు, గుండుబోగుల సత్తిబాబుకు చెందిన గడ్డిమేటు దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

జిత్‌మోహన్ మిత్ర గాన వైభవ స్వర్ణోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నటగాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా తొలిసారి పాడి 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం సాయంత్రం వైజంక్షన్ ఆనం రోటరీ హాలులో ఆయనను సత్కరించారు. సంఘ సేవకులు పట్టపగలు వెంకట్రావు అధ్యక్షత వహించగా, ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రజ్వలన గావించారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బీజేపీ నాయకులు సోము వీర్రాజు, దొండపాటి సత్యంబాబు, కోళ్ల అచ్యుతరామారావు, గుమ్మడి సమర్పణరావు అతిథులుగా విచ్చేశారు. మ్యూజిక్ అకాడమీ కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో కళారత్న పీవీఎస్ కృష్ణారావు, వి.జగపతి, జె.శివప్రసాద్, ఏఎస్ ఆనంద్, బి.రామ్మోహనరావు, సూర్య సిద్ధాంతి పాల్గొన్నారు.

టీటీ చాంపియన్లుగా రాజమండ్రి క్రీడాకారులు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఫన్ టైం క్లబ్ ఇండోర్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన 9వ ఏపీ స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ కోచ్ వీటీవీ సుబ్బారావు 50+ పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచారు. ఇదే అకాడమీకి చెందిన పి.శ్రీలక్ష్మితో కలిసి మిక్స్‌డ్ డబుల్ ఈవెంట్లో రన్నరప్‌గా నిలిచారు. శ్రీలక్ష్మి సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 100 మంది క్రీడాకారులు వివిధ జిల్లాల నుంచి పాల్గొన్నారు. కార్యదర్శి పి.విశ్వనాథ్, అధ్యక్షులు కె.జయరామ్ విజేతలకు బహుమతులు అందించారు.

రేపు ఎమ్మెల్యే పల్లెబాట, జనవాణి
ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పల్లెబాట కార్యక్రమాన్ని మంగళవారం రాజానగరంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటామన్నారు. దీనికి వివిధ శాఖల అధికారులు, కూటమి శ్రేణులు హాజరుకావాలన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి
ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూనే రాష్ట్రాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల రహదారులు మొత్తం ధ్వంసం అయ్యాయని వాటిని సంక్రాంతి నాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో సీఎం చంద్రబాబు నడిపిస్తున్నారని ఆయన తెలిపారు.





హై..హై నాయకా!

ఎడ్ల పందాలను చూస్తే ఎవరికి ఉత్సాహం రాదు.. అవి చెంగు చెంగున పరుగెడుతుంటే ఎంతటి వారిలోనైనా ఉత్సాహంగా ఉరకలు వేయాల్సిందే.. ఈయనెవరో గుర్తుపట్టారా.. ఇంకెవరు మన జిల్లాకు చెందిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్..రంగంపేట మండలం వడిశలేరులో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పందాల పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఆయన కాసేపు ఎడ్లబండి తోలి అందరినీ ఆశ్చర్యపరిచారు.. దీంతో అది చూస్తున్న జనం హై హై నాయకా అంటూ కీర్తించారు.. - వివరాలు 8లో

బాలలకు..షుక్రియా!

ఏమి ప్రదర్శనలు.. ఏమి వేషధారణలు.. ఆకట్టుకునే కట్టు, బొట్టులతో.. సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత వాయిద్యాలు, సైన్స్ ప్రాజెక్టులు, బుర్రకథ, చిత్రలేఖనం, మైమ్ వంటి అనే ప్రదర్శనలతో 'క్రియ' అదిరింది. విద్యార్థులు విజ్ఞానంతోపాటు వినోదాన్ని మేళవించి తమ ప్రదర్శనలతో వహ్వా అనిపించుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో రెండోరోజు 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. వేల సంఖ్యలో చిన్నారులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. - వివరాలు 7లో..










ఆదిపరాశక్తి.. ఉగ్రరూపంలో విద్యార్థిని



అర్ధనారీశ్వరుడిగా.. చిన్నారి ప్రదర్శన



కాకినాడలో జరిగిన కారు ప్రమాదం

సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన హత్యలు

సై..బర్ తెగింపు!

సైబర్ క్రైం ఏడాది 2024.. ఎలా ఖాతాలోని డబ్బుపోయిందో తెలియదు.. కానీ ఖాతా ఖాళీ అయిపోతుందంతే.. రెక్కీ చేయడం.. ఇంటిని ఎంపిక చేసుకోవడం.. రాత్రి వేళల్లో కన్నం వేయడం.. దొరికింది దోచుకుపోవడం.. ఇదంతా ఓల్డ్.. కాలం మారింది.. సాంకేతికతతో కంటికి కనిపించని కేటుగాళ్లు క్షణాల్లో జనాల ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేసేస్తున్నారు. సైబర్ నిపుణులకు అంతుచిక్కని విధంగా దోచుకుంటున్నారు. మరో వైపు హనీట్రాప్..ఇంకో వైపు డిజిటల్ అరెస్టులు.. ఇలా ఒకటేమిటి నేర స్వభావం తీరే మారిపోయింది.. తస్మాత్ జాగ్రత్త.. ఆద మరుపుగా ఉంటే అంతే.. ఇక రోడ్డు ప్రమాదాలు.. ఆత్మహత్యలు షరా మామూలే.. ప్రతి జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు 500 దాటాయి.. మూడు జిల్లాల్లో సుమారుగా 800 మంది వర కూ మృత్యువాత పడినట్టు సమాచారం. హత్యలు అదేస్థాయిలో పెరిగాయి.. పాతకక్షలు పడగవిప్పాయి.. ఏడాదంతా చూస్తే రక్తపాతమే.. ఏదో ఒక మూల ప్రమాదమే. ఎక్కడా ప్రశాంతత లేదు..

- సాంకేతికత తెచ్చిన కొత్త చిక్కు
- ఉమ్మడి జిల్లాలో దోపిడీలు
- కంటికి కనిపించని కేటుగాళ్లు
- హనీట్రాప్.. డిజిటల్ అరెస్టులు
- పోలీసులకు చిక్కని వైనం
- పడగవిప్పిన పాతకక్షలు
- పచ్చని తూర్పున హత్యలు
- ఆత్మహత్యలకు అంతే లేదు
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- 800 మంది మృత్యువాత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సాంకేతిక ఏ స్థాయిలో పెరుగుతుందో సైబర్ నేరాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇవి సమాజ భద్రతకు పెనుసవాళ్లగా మారాయి. పోలీస్ వ్యవస్థకు అంతుబట్టని విధంగా ఈ నేరాలు మారాయి. ఆన్‌లైన్ యాప్‌లు మోసాలతో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఏవో లింక్‌లు, మెసేజ్ పంపి, వాటిని చూడానికి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయిపోతున్న ఉదం తాలు పెరిగాయి. స్టాక్ మార్కెట్ పేరిట మోసాలు జరుగుతున్నాయి. ఇటీవల డబ్బున్నవాళ్లు, అధికారులు,ఉద్యోగస్తులు, వ్యాపారులే టార్గెట్‌గా డిజిటల్ అరెస్టులు మొదలయ్యాయి. జార్ఖండ్‌లో జాంతార జిల్లా కేంద్రంగా ఇవి ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు పసిగట్టారు. ఢిల్లీ, నోయిడా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి డిజిటల్ అరెస్టులు జరుగుతున్నట్టు సమాచారం. జిల్లాలో కొద్ది నెలల కిందట మోరంపూడి సెంటర్ ప్రాంతంలో ఓ డాక్టర్‌కు ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేసి రూ.6లక్షలు లాగేశారు. ఆఫీసర్స్ క్లబ్‌లో కోచ్‌గా పనిచేస్తున్న ఒకాయనను భయపెట్టి, డిజిటల్ అరెస్ట్ చేసి రూ.96వేలు లాగేశారు. రామచంద్రపురంలో ఒకాయనకు ఫోన్ చేశారు. రాజమండ్రికి చెందిన ఓ ఏసీటీవోను కొంతకాలం కిందట హనీ ట్రాప్ చేశారు. ఒక అమ్మాయి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా ఆయన ఒకే చేశారు. తర్వాత న్యూడ్ వీడియో రాగా చూసి చాటింగ్ మొదలెట్టాడు. తర్వాత అతన్ని బెదిరించడంతో కొంత డబ్బు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. కడియంలో ఒక విద్యార్థికి ఉద్యోగం ఆశ చూపి సుమారు రూ.10 లక్షలు లాగేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఓ స్టాక్ మార్కెట్ చేసే యువకుడు రూ.33 లక్షల వరకూ నష్టపోయాడు. జిల్లాలో ఈ తరహా నేరాలు పెరిగిపోయాయి.కానీ చాలా తక్కువ మంది మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఈఏడాది 140 సైబర్ నేరాలు..11 డిజిటల్ అరెస్టులు జరిగాయి. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు ప్రమాదం నుంచి తప్పించుకోవాలంటే కేవలం అవగాహన ఒకటే మార్గం.ఈ ఏడాది 500 వరకూ ప్రమాదాలు జరగ్గా 700 మందికిపైగా క్షతగాత్రులయ్యారు.300 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో తలకు గాయం కావడం వల్ల 90 మంది వరకూ ప్రాణాలొదిలారు. ఈ ఏడాదిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లం ఘనలపై 45 వేల కేసులు నమోదు చేయగా రూ.50లక్షల వరకూ జరిమానాలు విధించారు.ఈ ఏడాది అక్టోబరు 15న జరిగిన మహిళ అత్యాచారం జిల్లాను కుదిపేసింది. కడియం మండలం బుర్రిలంకలో నర్సరీలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న రౌతు కస్తూరి అనే మహిళపై నలుగురు అత్యాచారం చేసి చంపేసి కాలువలో పడేశారు. ఉండ్రాజవరం మండలంలో అక్టోబరు 30న దీపావళి టపాసుల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఇదే మండలంలో ఫ్లెక్సీ కడుతుండగా కరెంట్ షాక్‌కి గురై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దేవరపల్లి మండలంలో జీడిపిక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్ తిరగబడడంతో నిడదవోలు మండలానికి చెందిన ఎనిమిది మంది చనిపోయారు. ఈ ఏడాది రహదారులు రక్తాన్ని తాగేశాయి.



గన్నవరం వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్య, కుమారుడిని పట్టుకుని రోదిస్తున్న భర్త

కోనసీమలోనూ రక్తపాతం..



హత్య కేసులో అరెస్టయిన పినిపే శ్రీకాంత్(ఫైల్)

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు.. హత్యలు.. దొంగతనాలు.. దోపిడీలతో పాటు సైబర్ నేరాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 2024 సంవత్సరం రికార్డులకెక్కింది. గంజాయి.. అక్రమ మద్యం రవాణా..దోపిడీలు, దొంగతనాలు అదే స్థాయిలో ఉన్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో యువకులే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు.అనేకమంది ఆత్మ హత్యలకు పాల్పడ్డారు.వివాహేతర సంబంధాలు, భూ వివాదాలతో కొందరు హత్యలకు గురైన ఘటనలు ఉన్నాయి.జిల్లాలో 2024 సంవత్సరంలో హత్యోదంతాలు సంచలనం రేకెత్తించాయి. గతేడాది జరిగిన అయినవిల్లి గ్రామానికి చెందిన జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసును ఇటీవల పోలీసులు ఛేదించి ఆ కేసులో వైసీపీ నేత తనయుడు పినిపే శ్రీకాంత్‌ను అరెస్టు చేయడం సంచలనమైంది. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో పెంచుకున్న కొడుకు రాంబాబు ఆస్తి కోసం తండ్రి రావి వీరవెంకటనరసింహారావు (75)ను హత్య చేశాడు. ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా పెరిగింది.జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనలు నిత్యం మృత్యు ఘంటికలు మోగిస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మే నెలాఖరునాటికి 65 మంది మృతిచెందగా 230 మందికి పైగా గాయపడ్డారు. ప్రధాన రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 53 కేసుల్లో 65 మంది మృతిచెందారు. 145 కేసుల్లో 230 మందికి గాయాలయ్యాయి. జాతీయ రహదారులపైనే ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏడాదిలో భారీ దొంగతనాలు, దోపిడీలు జరిగాయి. పోలీసులు కూడా కేసుల పురోగతి సాధించి రికవరీ కూడా అదేస్థాయిలో చేశారు.



కాకినాడలో కత్తులు దూశారు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో నేరాలు, ఘోరాలు పెరిగాయి.హత్యలతో అట్టుడికింది. బ్యాంకు చోరీల దగ్గర నుంచి తుపాకీ చూపించి జ్యూయలరీ షాపుల్లో బంగారం ఎత్తుకుపోవడం, ప్రతీకారేచ్ఛతో నరుక్కోవడం వరకు అనేక పెను సంచలనాలకు జిల్లా కేంద్రంగా మారింది. అక్టోబరు 31న అర్ధరాత్రి కాజులూరు మండలం శలపాకలో ముగ్గురి దారుణహత్య జరిగింది. పాతకక్షల నేపథ్యంలో ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు.ఇదే తరహాలో డిసెంబరు 15న సామర్లకోట మండలం వేట్లపాలెంలో స్థలం ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నారనే ఆగ్రహంతో దళితవాడలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని ప్రత్యర్థి కుటుంబం దారుణంగా నరికి చంపేసింది. జనవరి 23న కాకినాడలో ఏసీబీకి డ్రైనేజీ విభాగం ఈఈ పట్టుబడడంతో ఉద్యోగుల్లో దడ పెంచింది. ఫిబ్రవరి 8న ప్రత్తిపాడు స్టేట్ బ్యాంకులో జరిగిన భారీ చోరీ పోలీసులనే బెంబేలెత్తించి ంది. యూపీకి చెందిన ఓ ముఠా అర్ధరాత్రి వేళ ఏకంగా బ్యాంకుకే కన్నం వేశారు.ఈ ఘటనలో రూ.1.50 కోట్ల విలువైన బంగారం, రూ.30 లక్షల నగదు సైతం తస్కరించారు. ఫిబ్రవరి 26న ప్రత్తిపాడు వద్ద హైవేపై వెళ్తున్న లారీకి పంక్చర్ పడడంతో డ్రైవర్, ఇద్దరు క్లీనర్లు చూస్తుండగా రాజమహేంద్ర వరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోవడంతో ముగ్గురు దుర్మరణం పాల య్యారు. మార్చి 20న చేబ్రోలులో జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి.ఏప్రిల్ 1న కత్తిపూడిలో ఓ దుకాణంలో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. జూలై 20న కాకినాడ కల్పన సెంటర్‌లో రాత్రి 9గంటలకు వేగంగా వచ్చిన ఓ కొత్తకారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని ఓ పాదచారిని ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు.ఆగస్టు 21న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఫార్మా కంపెనీ ప్రమాదంలో 18 మంది చనిపోయారు.వీరిలో ఇద్దరు కాకినాడ జిల్లాకు చెందిన వారు ఉండడం విషాదం నింపింది. డిసెంబరు చివరి వారంలో వరుసగా కాకినాడ, అన్నవరంలో రెండు వేర్వేరు జ్యూయలరీ దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి.ఇలా ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కాకినాడలోనూ కలకలం రేగింది.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ప్రతి ధాన్యపు గింజ కొంటాం
మంత్రి నాదెండ్ల మనోహర్

కోరుకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రోడ్లపైనే ధాన్యం రాశులు అంటూ ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు.రాజానగరంలో సమావేశాన్ని ముగించుకుని శనివారం రాత్రి తిరిగి వెళుతూ మార్గమధ్యలో కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామం వద్ద రోడ్లపై ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల వారం రోజులుగా ధాన్యం రోడ్లపైనే ఉంచి కాపలా కాసుకుంటున్నామని మంత్రికి రైతులు వివరించారు. దీంతో ఎప్పటి నుంచి ధాన్యం కొనుగోలు ఆపివేశారని ఉన్నతాధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఇంకా 8వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మంత్రికి వివరించారు. దీనిపై నాదెండ్ల మాట్లాడుతూ వచ్చే సోమ, మంగళవారం నాటికి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే రూ.10 వేల జరిమానా
నూతన వేడుకలకు నిబంధనలు తప్పనిసరి : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో జిల్లా పోలీస్ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్పీ డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. న్యూఇయర్ వేడులకు సంబంధించి మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్దేశించిన సమయం వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ చేస్తే రూ.10 వేలు ఫైన్ లేదా ఆరునెలలు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.బైక్‌లకు సైలెన్సర్ లేకుండా తిరిగినా.. ఓవర్ స్పీడు.. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారి వాహనాలు సీజ్ చేసి, డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దుచేస్తామన్నారు.మహిళలకు ఇబ్బందులు ఉంటే మహిళా రక్షక్ టీమ్‌లను సంప్రదించాలని సూచించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అధికారులు

3న కొవ్వూరుకు సీఎం చంద్రబాబు రాక

కొవ్వూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం నారా చంద్రబాబు నాయుడు కొవ్వూరులో జనవరి 3వ తేదీన పర్యటిస్తారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు ఆరికిరేవుల రోడ్‌లో ఉన్న స్పెక్ లేఅవుట్‌లో ముఖ్యమంత్రి సభ, హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాలను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. కొవ్వూరు స్పెక్ లేఅవుట్‌లో గృహ ప్రవేశాలకు ముఖ్యమంత్రి వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో స్పెక్ లేఅవుట్‌లో 1100 ప్లాట్లకు సంబంధించి 800 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వంలో బిల్లులు పూర్తిగా అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు పూర్తిగా బిల్లులు చెల్లించి గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ జనవరి 3వ తేదీన కొవ్వూరు స్పెక్ లేఅవుట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు ప్రారంభిస్తార న్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, తాళ్లపూడి మండల అధ్యక్షుడు నామాన పరమేశ్వరరావు, హౌసింగ్ పీడీ ఎస్. భాస్కర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్, డీఈ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలర్స్ బ్యూటీ సెలూన్ అండ్ స్పాలో వ్యభిచారం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో స్పా ముసుగులో వ్యభిచారం చేస్తున్న బ్యూటీ సెలూన్‌పై ప్రకాష్ నగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని కలర్స్ బ్యూటీ సెలూన్ అండ్ స్పాపై ఆదివారం దాడి చేశారు.అక్కడ ఇద్దరు విటులు,ఆరుగురు మహిళలు, నిర్వాహకులను గుర్తించి అరెస్టు చేసినట్టు ప్రకాశ్‌నగర్ సీఐ బాజీ లాల్ చెప్పారు. స్పా ముసుగులో వ్యభిచారం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొవ్వూరు సీఐ విశ్వం



కొవ్వూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): న్యూయర్ వేడుకల సందర్భంగా మద్యం తాగి మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహకులు, లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టంలు ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరి అన్నారు. అశ్లీల నృత్యాలు, సినిమాలు అనుమతించబడవన్నారు. లైసెన్సు లేకుండా మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పేకాడడం నిషేధమన్నారు. రాత్రి 10గంటలు దాటిన తరువాత మ్యూజిక్ సిస్టమ్స్ వాడరాదన్నారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువత, రోడ్లపై చిందులు తొక్కే మందుబాబులు, ఇష్టానుసారం వాహనాలు నడిపే వారిని చిత్రీకరించేందుకు పట్టణంలో వీడియో, డిజిటల్ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. సైలెన్సర్లు తీసి వాహనాలు నడపడం, హారన్ మోగిస్తూ రాంగ్ రూట్లలో డ్రైవ్ చేయడం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం, బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం నేరమన్నారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపడతామని సీఐ విశ్వం పేర్కొన్నారు.

అనుమతి తప్పనిసరి: ఎస్ఐ సతీష్



గోపాలపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి నిర్దేశించిన సమయం వరకు మాత్రమే హోటళ్లు, వైన్‌షాపులు, బార్లు నిర్వ హించాలన్నారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామగ్రామాన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఈవెంట్లు నిర్వహించే వారు పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కార్యక్రమాల్లో అశ్లీలత ఉండరాదన్నారు. నిర్ణీత స్థాయికి మించి సౌండ్ ఉండరాదన్నారు. మత్తు పానీయాలు, మద్యం వంటివి తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. 31వ తేదీ రాత్రి మహిళలకు ఎటువంటి ఇబ్బందులున్నా మహిళా రక్షక టీమ్‌లను సంప్రదించాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మేకా ఫణీంద్రకు రూ.1,60,646, అనిశెట్టి శ్రీదేవికి రూ.15,000 చెక్కులను పంపిణీ చేశారు. అలాగే కొవ్వూరు స్పెక్ లేఅవుట్‌లో హౌస్ ఆఫ్ గ్రేస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో పాస్టర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత చేతుల మీదుగా సండే స్కూల్ పిల్లలు 30 మందికి నూతన వస్త్రాలు పంపిణీచేశారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటి సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, టీడీపీ మండలాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, తాళ్లపూడి మండలాధ్యక్షుడు నామాన పరమేశ్వరరావు, కొక్కిరిపాటి రాజు, చౌటిపల్లి సూర్యనారాయణ, జనసేన నాయకుడు సుంకర సత్తిబాబు, బీజేపీ నాయకుడు చౌటిపల్లి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే మద్దిపాటి



దూబచర్లలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజక వర్గంలో ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దూబచర్లలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. సీసీ రోడ్లు పూర్తి అయిన వెంటనే డ్రైనేజీలు, పంట రోడ్లు అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏలేటి సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కరరావు, సింహా, రాజులపాటి ఆదినారాయణ పాల్గొన్నారు.

తాడిపర్రులో బుద్ధిస్ట్ కౌన్సిల్ సమావేశం



బుద్ధుడి విగ్రహం వద్ద కౌన్సిల్ సభ్యులు, అభిమానులు

ఉండ్రాజవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామంలో బుద్ధిస్ట్ కార్యాలయంలో ఆదివారం బుద్ధిస్ట్ కౌన్సిల్ సమావేశం ఉండ్రాజవరం బౌద్ధ దమ్మపీఠం అధిపతి అనాలయో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధ దమ్మ కార్యక్రమాలను విరివిగా ప్రచారం చేయాలని సూచించారు. వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. బుద్ధ పూజ చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు,తణుకు ఉమెన్స్ కాలేజీ చైర్మన్ సీహెచ్ ఉషారాణి, కె.విజయచౌదరి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ వల్లే విద్యుత్ భారాలు

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



నిడదవోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్మోహనరెడ్డి పాలనలో విద్యుత్ చార్జీలను పెంచి ఇప్పుడు వైసీపీ శ్రేణులు ధర్నాలు చేయడం ప్రజలను పూర్తిగా మోసగించడమేనని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. జగన్ అవినీతి వల్లే విద్యుత్ భారాలు రూ.1,29,000 కోట్లకు పెరిగిపోయాయని, విద్యుత్ చార్జీల పెంపు పూర్తిగా అతడిదేనని అన్నారు. అప్పుడు విద్యుత్ చార్జీలను పెంచి ఇప్పుడేదో కొత్తగా చార్జీలు పెరిగినట్టు వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం మోపాడన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది అమ్మవారి దర్శనం కలుగజేశారు.

సుందరేశ్వరుడికి అభిషేకాలు



కొవ్వూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. గోష్పాద క్షేత్ర లక్షపత్రి పూజా కమిటీ అధ్యక్షుడు అనుపిండి చక్రధరరావు పర్యవేక్షణలో దూళిపాళ నృసింహ సోమయాజుల దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి, సుందర గణేష్, తెన్నేటి సూర్యనారాయణ, కలిగొట్ల కృష్ణారావు, తంగిరాల రామ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల సమావేశం పాలంగిలో ఆదివారం నిర్వహించారు. సంస్థ మండలాధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మండలంలోని మోర్త గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న అయిశెట్టి ఏసుదాసు, కర్రి రమణ, నేమళ్ల లీలావతి, తాళం నాగమణిలకు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు తాతిన కృష్ణారావు, వెలిచేటి బోసు, పణితిని పార్వతి, సుంకవల్లి కోటేశ్వరరావు, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

చాగల్లు, డిశంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాగల్లులో భక్తాంజనేయస్వామి ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం భుజించారు. భక్తాంజనేయస్వామి ఉత్సవ కమిటి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతులు తెలిపారు.

ప్రమాదం అంచున ఉన్నా.. పట్టించుకోరా!



ఇటీవల కాలువలో పడి మృతిచెందిన బాలుడు అద్విత్(4)





నివాసాలకు చేర్చి ఉన్న వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం కాలువ

- నివాసాలకు చేర్చి ప్రమాదకరంగా కాలువ
- ఇటీవల నాలుగేళ్ల బాలుడి మృతి
- తరచూ ప్రమాదాలు.. పట్టని పాలకులు
- సమస్య పరిష్కరించాలని డిమాండ్

తాళ్లపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేద బతుకులు.. ప్రమాదం అంచున బతికీడుస్తున్నాయి.. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకున్నవారే కానరావడంలేదు.. ఎన్నో ఏళ్లగా సమస్య ఉన్నా కనీసం కన్నెత్తి చూసినవారే లేరు. ఈ గురువారం నాలుగేళ్ల బాలుడి మృతితో మళ్లీ ఆ సమస్య వెలుగులోకి వచ్చింది.. అయినా నేటి వరకూ ఏ ఒక్కరూ సమస్య పరిష్కారానికి స్పందించిన దాఖలాలు లేవు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం కాలువ వెంబడి బల్లిపాడు గ్రామంలో 15 కుటుంబాల నివాసం ఉంటున్నాయి. ఈ కాలువ రోడ్డుకు సమాంతరంగా ఉంటుంది.ఆదమరిచారో అంతే.. ఆ కాలువ చెంతన ఉండే నివాసంలో తలపాకుల ఝాన్సీరాణి తన ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటుంది. చిన్న కుమారుడు అద్విత్ ఇటీవల అంగన్‌వాడీకి వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చాడు. అమ్మతో ఆడుకుంటానని చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతకీ అలికిడి లేకపోవడంతో తల్లి కంగారుపడింది. ఎంత పిలిచినా పలకకపోవడంతో ఏవైపో యాడోనని వెతుక్కుంది. ఈ లోపున కుమారుడు కాలువలో విగత జీవిగా కనిపించాడు. దీం తో ఆమె కన్నీటిపర్యంతమైంది. కుమారుడిని పట్టుకుని బోరున విలపించింది.ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.ప్రమాదాలు జరగకుండా కాలువ గట్టు వద్ద రక్షణ ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నామని అయినా స్పందనలేని బంధువులు విలపించారు.తమ మధ్య ఆడుతూ పాడుతూ తిరిగే బాలుడు మృతితో ఆ కాలువ వైపు చూడాలంటేనే జనం భయపడుతున్నారు. ఇకనైనా నాయకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకులు కష్టంలో ఉన్నా కనీసం స్పందించలేదని వాపోయారు.

నా కష్టం వేరెవరికి రాకూడదు : ఝాన్సీరాణి, బాలుడి తల్లి



నా పరిస్థితి వేరెవరికి రాకూడదు.. ఇంకా నా కొడుకు ఎక్కడ అని వెతుక్కుంటున్నాను.. చాలా బాధగా ఉంది.. అప్పుడే వాడు లేకుండా నాలుగు రోజులు గడిపేశాను.. చాలా కష్టంగా ఉంటుంది.. వాడిని కాపాడుకోలేకపోయాను.. నా చేతులారా చంపేసుకున్నట్టు అయిపోయింది.. చాలా కాలంగా సమస్యను పాలకులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదు. అందుకే ఈ రోజు నాకు ఇటువంటి పరిస్థితి వచ్చింది.. ఇకనైనా పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

ఎస్సీ కులాల సర్వే జాబితా సవరణ గడువు పెంచాలి

ఎమ్మార్పీఎస్ అండ్ ఎంఎస్పీ ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి చిన్న సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న సుబ్బారావు

కొవ్వూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ కులాల సర్వే జాబితాలో సవరణ గడువు పెంపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ అండ్ ఎంఎస్పీ ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లతో చేపట్టిన కులగణనలో మాదిగలను మాలలుగా నమోదు చేశారని విమర్శించారు. సర్వే జాబితాలో సవరణకు డిసెంబరు 31తో గడువు ముగుస్తుందని, సవరణ పూర్తిస్థాయిలో చేపట్టాలని, అందుకు గడువును పొడిగించాలన్నారు. మాదిగ మాస్టిన్లను సైతం మాలలుగా నమోదు చేశారన్నారు. కులగణన జాబితాలో జరిగిన అవకతవకలు, తప్పులపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఏకసభ్య కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో సచివాలయాల వద్ద కులగణన జాబితాలను పరిశీలించి తప్పులను సరిచేయాలని పిలుపునిచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్, ముప్పిడి దానియేలు, వరిగేటి కాంతరాజు, కొక్కిరిపాటి వెంకటేష్, మనెల్లి నాని, గాలింకి రాము, గెడ్డం జగ్జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సరిచేసుకోవాలి: మధుబాబు

ఉండ్రాజవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన జాబితాలో కులం పేరు తప్పులను సరిదిద్దుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దిద్దే మధుబాబు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం కులగణన జాబితాలను ఆయా గ్రామాల్లో సచివాలయాల్లో ఏర్పాటు చేసిందని, వీటిలో చాలా గ్రామాల్లో తమ పరిశీలనలో ఎస్సీ మాదిగ కులం వ్యక్తి పేరు వద్ద కులం ఎస్సీ మాలగా నమోదైనట్టు చెప్పారు. ఎస్సీ మాదిగ కులస్తులు సచివాలయాల్లో ఉన్న జాబితాల్లో కులం పేర్లు తప్పుగా వచ్చాయని వాటిని వెంటనే వెళ్లి సరిచేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్ పర్యటిస్తోందన్నారు. ఎస్సీలోని మాదిగ, మాల కులస్తుల జనాభాను అనుసరించి వర్గీకరణ జరుగుతోందని మధుబాబు వివరించారు. ఎస్సీలోని మాదిగలంతా తమ కులం పేరు తప్పులను సవరించుకోవాలని మధుబాబు కోరారు.

రహదారులు ఛిద్రం

- దమ్ము చక్రాలతో రోడ్లపై తిరుగుతున్న ట్రాక్టర్లు
- మరమ్మతులకు గురవుతున్న రహదారులు



కవులూరులో రోడ్డుపై పట్టా లేకుండా వెళుతున్న దమ్ము చక్రాల ట్రాక్టర్

నల్లజర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దమ్ము చక్రాలు(వీల్స్) ట్రాక్టర్లుకు పట్టా లేకుండా నూతనంగా వేసిన రోడ్లపై వెళుతూ ఛిద్రం చేస్తున్నాయి. ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి రోడ్లు పోసినా దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు తిరగడం వల్ల త్వరగా పాడైపోతున్నాయి. పట్టా లేని దమ్ము చక్రాల ట్రాక్టర్లు రోడ్డుపై వెళుతున్న పట్టించుకునే నాథుడే లేడు. దాళ్వా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో రోడ్లపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు పట్టాలు వేసుకుని వెళ్లే విధంగా ట్రాక్టర్ల యాజమానులకు అవగాహన కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీజేపీ గోపాలపురం అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



గోపాలపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా చెరుకుమిల్లి గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ మండల కార్యాలయం వద్ద జిల్లా ఎన్నికల పరిశీలకుడు అడబాల రామకృష్ణ పర్యవేక్షణలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. కాగా వెంకటేశ్వర రావు 24 ఏళ్లగా బీజేపీలో కొనసాగుతూ మండల ఉపాధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యుడిగా, ఓబీసీ మండలాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండేపాటి రత్నాజీచౌదరి, పీవీ నరసింహరాజు, ఇల్లూరి పెంటలరాజు, మార్కండేయచౌదరి, బొడ్డు వీరరాఘవులు, దేవిన శ్రీనివాసరావు, ఆకుల సుబ్రహ్మణం, నిడమర్తి సత్యకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిడదవోలు ఇన్‌చార్జిగా రాము



నిడదవోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిడదవోలుకు చెందిన గాలింకి రామును జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడిగాను, నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగాను ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ తెలిపారు. ఆదివారం కొవ్వూరులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఆయన ప్రకటించినట్టు ఎమ్మార్పీఎస్ కమిటీ తెలిపింది.

రోడ్డు పక్కనే డంపింగ్

- యాదవోలు, చిన్నాయిగూడెంలో అపరిశుభ్రంగా వీధులు
- చెత్తకుప్పలతో దుర్గంధం
- రోగాల వ్యాప్తిపై గ్రామస్తుల్లో భయాందోళన



చిన్నాయిగూడెంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు

దేవరపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెంలో అపరిశుభ్రంగా వీధులు, రహదారుల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ మధ్యలో ఉన్న వీధిలో చెత్తకుప్పలతో దుర్గంధం వస్తోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు ఈ చెత్తకుప్పను దాటుకుని వెళ్లాల్సి వస్తుంది. పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ వద్ద చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛభారత్ అంటూ ప్రకటనలు ఊదరగొడుతున్నారని, కాని అవి ఆచరణలో కనబడడం లేదని అంటున్నారు. చిన్నాయిగూడెంలో స్వాగతం బోర్డులతో పాటు చెత్తకుప్పలు కూడా స్వాగతం పలుకుతున్నాయి. రహదారుల పక్కనే ఈ చెత్తకుప్పలతో డంపింగ్‌యార్డులుగా తయారయ్యాయి. దీనికి తోడు ఈ చెత్తకుప్పలను పందులు, కుక్కలు, చెల్లాచెదురు చేయడంతో రోడ్ల పైకి చెత్త చేరుతుంది. వాహనదారులు బాటసారులు కంపు భరించలేక ముక్కులు మూసుకుని నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చెత్త కుప్పడలు పేరుకుపోవడంతో దోమలు పెరిగి వ్యాధుల బారిన పడతారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేపట్టి ప్రజాఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



యాదవోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెత్తపోగులు

ఎడ్ల పందేలు సంప్రదాయాల్లో భాగం

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు
- వడిశలేరులో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు



పోటీలో పాల్గొన్న ఎడ్ల బండి



సీనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే వాసు

రంగంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు, కోడి పందేలు మన సంప్రదాయాల్లో, గ్రామీణ సంస్కృతిలో భాగమని, ఇవి లేకపోతే నాణ్యమైన పశుపక్ష్యాదుల సంపద అంతరించిపోతుందని, చట్టాన్ని అతిక్రమించకుండా ఇలాంటి పందేలను ఆదరించి పోషించుకోవాలని శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామం వద్ద గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలను ఆదివారం నిర్వహించారు. పందేలను రఘురామ తిలకించి సీనియర్ విభాగంలో విజేతలైన రైతులకు బహుమతి ప్రదానం చేశారు. తండ్రి పేరిట ఈ పోటీలను ఏటా నిర్వహిస్తున్న జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ గన్ని భాస్కరరావును ప్రశంసించారు. కాగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పోటీలను ప్రారంభించారు. పోటీలను క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషమన్నారు. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ కోడి పందేలు, ఎడ్ల పందేలు లేని తెలుగు సంప్రదాయాన్ని ఊహించలేమన్నారు. జూనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గన్నిభాస్కరరావు తెలుగు సంప్రదాయాన్ని పటిష్ఠం చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశ్ రావు,జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

రంగంపేట/అలమూరు: వడిశలేరులో జరిగిన ఎడ్లబండ్ల పరుగు పోటీల్లో సీనియర్ విభాగం (1600 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్లజత మొదటి బహుమతి, అనకాపల్లి జిల్లా కేజీ పురం రైతు శ్రీఆంజనేయం ఎడ్లజత రెండో బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్ల జత మూడో బహుమతి గెలిచుకున్నాయి. జూనియర్ విభాగం(1000 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల కృష్ణమాధవి ఎడ్ల జత మొదటి బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరు రైతు కోర స్మృతి చౌదరి ఎడ్ల జత రెండో బహుమతి, నెల్లూరు జిల్లా గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరీ సీఫుడ్స్ ఎడ్ల జత మూడో బహుమతి గెలుచుకున్నాయి. పోటీల న్యాయనిర్ణేతలైన సూరపనేని రామకృష్ణప్రసాద్ (కృష్ణా జిల్లా), చేకూరి రామకృష్ణ (కాకినాడ)లను సత్కరించారు.

ప్రజాపోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ప్రణాళిక నిత్య నూతనం అని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. సీపీఎం పార్టీ తూర్పుగోదావరి జిల్లా మహాసభల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం నిర్వహించిన ప్రతినిధులు సభలో అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి వంటిదని అన్నారు. దేశంలో రాష్ట్రంలో కుల, వర్గ, మతం వంటి సామాజిక విభజన ఉన్నప్పటికీ కమ్యూనిస్టులను అందరూ స్వాగతిస్తారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ కవులు, కళాకారులకు పుట్టినిల్లయిన రాజమహేంద్రి అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, రాజ్యాంగానికి యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. ఇదే విధానాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. మహాసభలో నివేదికను జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, పి.తులసి, సుందరబాబు, జేబీరాణి, ఎస్.రాజా, ఎస్ఎస్ మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.